క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇప్పించాలని వినతి



హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీశకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కోటనందూరు: మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇప్పించాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీశను మండల వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు శుక్రవారం ఎంపీపీ లగుడు శ్రీనివాసు, ఏపీబీ రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు అమరావతిలో ఎండీ లక్ష్మీషాను కలిసి వినతిపత్రం అందజేశారు. తొలి విడతలో మంజూరైన లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటున్నారని, రెండో విడత జాబితాను కూడా అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. జగనన్న కాలనీల్లో రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, మంచినీటి వసతుల కల్పనకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సుర్ల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు రుత్తల జోగిరాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గోకవరం: గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ దాసరి రంగా, ఎంపీపీ సుంకర శ్రీవల్లి సూచించారు. గోకవరంలోని గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ సీడీపీఓ వి.లక్ష్మి, సెక్టర్ సూపర్‌వైజర్ పి.ఇందిరారాణి ఆధ్వర్యంలో శుక్రవారం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రమేష్, వీరబాబు, తోలేటి ప్రసాద్, నరాలశెట్టి నరసయ్య, బత్తుల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

134 మందికి కంటి పరీక్షలు



తునిలో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

తుని: దృష్టిలోపం ఉన్న వారికి తుని వాకర్స్ క్లబ్ అందిస్తున్న కంటి వైద్య సేవలు అభినందనీయమని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణరాజు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం శంకర్ ఫౌండేషన్ సహకారంతో కిరణ్మయి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో 134 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 52 మందిని శుక్లాల ఆపరేషన్ కోసం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం సీనియర్ వాకర్ దన్యంరాజు సత్యసాయిని క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, ఎలెక్ట్ గవర్నర్ చదరం శివాజీ, తుని శాఖ అధ్యక్షుడు కుందెం సత్యనారాయణ, కంకిపాటి జమీల్, చోడిశెట్టి బాబూరావు, కండవల్లి జోసెఫ్, పాఠశాల హెచ్ఎం నూకరత్నం, వైద్య సిబ్బంది రాము, సోమేష్, దుర్గ తదితరుల పాల్గొన్నారు.

అన్నసమారాధన

కిర్లంపూడి: మండలంలోని కొత్తపేట శ్రీకృష్ణుని ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. కృష్ణాష్టమి ముగింపు వేడుకలను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

తుని: ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సాధన మహిళా పట్టణ సమాఖ్య సర్వసభ్య సమావేశం కమిషనర్ ప్రసాదరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుధారాణి మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలకు సున్నా వడ్డీతో పాటు చిరు వ్యాపారాలకు సహాయం అందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మహిళలు మహారాణులుగా సమాజంలో గౌరవం పొందుతున్నారన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షురాలిగా ఎస్‌కే నసీమా, కార్యదర్శిగా ఎం.అరుణ, కోశాధికారిగా కె.దేవి, ఉపాధ్యక్షురాలిగా కె.వెంకటలక్ష్మి, సహాయ కార్యదర్శిగా ఎస్‌కే ముంతాజ్, పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరితో చైర్‌పర్సన్ సుధారాణి ప్రమాణ స్వీకారం చేయించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, మెప్మా అధికారి శ్రీదేవి, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2022–23 చేపట్టిన పనులను డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఉపాధి సిబ్బంది ఎం.భానుప్రకాష్, వీఓ రాజేష్, అంబుడ్స్‌మెన్ జ్యోతి, ఎంపీడీఓ రామన్ పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామాల అభివృద్ధి

- ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- భద్రవరం, కొత్త యర్రవరం గ్రామాల్లో నూతన సచివాలయ భవనాలు ప్రారంభం



భద్రవరంలో సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని భద్రవరం, కొత్త యర్రవరం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలను శుక్రవారం ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సచివాలయ వ్యవస్థతో గ్రామాలు, వార్డు స్థాయిలో ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. ఎమ్మెల్యే పర్వత మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాల ద్వారా లబ్ధిదారుల ఇంటికే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల్లో ఎటువంటి అవినీతికి ఆస్కారం లేదన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు కూడుపూడి భరత్, కూడుపూడి శైలజ, జెడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి, వైస్ ఎంపీపీలు చిక్కాల రాజ్యలక్ష్మి, సాదే లోవరాజు, సర్పంచులు కూనపురెడ్డి సుబ్బారావు, బీశెట్టి అప్పలరాజు, చిక్కాల లక్ష్మణరావు, నీరుకొండ సత్యనారాయణ, బొడ్డుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- యర్రవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం



యర్రవరంలో మహిళలకు పథకాలు వివరిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని యర్రవరంలో శుక్రవారం ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులతో కలిసి ఎంపీ, ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లలో 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు కూడుపూడి భరత్, కూడుపూడి శైలజ, జెడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి, వైస్ ఎంపీపీలు చిక్కాల రాజ్యలక్ష్మి, సాదే లోవరాజు, సర్పంచ్ భీశెట్టి అప్పలరాజు, నీరుకొండ సత్యనారాయణ, దాసరి రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- మాజీ మంత్రి తోట నరసింహం
- సోమరాయణంపేటలో ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

కిర్లంపూడి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. మండలంలోని సోమరాయణంపేటలో శుక్రవారం రాపేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి వచ్చిన అభిమానులను, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్ని పార్టీలు కలిసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల ఆత్మీయ సమావేశాల నిర్వాహకులు తోట బాబ్జీ, తోట రాంజీ, అత్తులూరి సాయిబాబు, తోట అయ్యన్న, ఓలేటి రాజేశ్వరరావు, అడబాల సుబ్బారాయుడు, ఎస్.కపూర్ తదితరులు పాల్గొన్నారు.

తగాదాలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్ శివకుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మోషే, తదితరులు

తుని రూరల్: ఎస్.సూరవరంలోని రెండు వర్గాల దళితుల మధ్య నెలకొన్న తగాదాలను పరిష్కరించాలని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అరుగుల మోషే కోరారు. ఈ మేరకు శుక్రవారం వందలాది మంది తన వర్గంతో కలిసి తహసీల్దార్ శివకుమార్, రూరల్ సీఐ సన్యాసిరావు, ఎస్సై విజయబాబులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్.సూరవరంలో పూర్వం రెండు దళిత వర్గాలకు కాలనీ ఇళ్లు ఇచ్చారని, అక్కడే సామాజిక భవనం, క్రీడా స్థలం మంజూరు చేశారన్నారు. కాలక్రమంలో ఒకవర్గమే సామాజిక భవనాన్ని, ఆట స్థలాన్ని వినియోగించుకోవడంతో తమ వర్గం నష్టపోతుందని మోషే పేర్కొన్నారు. గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని తగాదాలను పరిష్కరించినా వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ప్రస్తుతం పరిస్థితి మొదటికి వచ్చిందన్నారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కె.ప్రేమ్‌కుమార్, ఎం.అప్పారావు, ఎం.సోంబాబు, కె.అప్పారావు, మోర్తా అప్పలనర్స, కాపారపు చిననూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పక్వాడా ర్యాలీ

జగ్గంపేట: గ్రామంలో శుక్రవారం స్వచ్ఛ పక్వాడా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు మొక్కలు చేతపట్టి స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు, ఇంటికో మొక్క పెంచుతాం అనే నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో 300 మొక్కలను నాటారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాట్ల కృష్ణవర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీలింగ్ భూములకు పట్టాలు ఇవ్వాలి



జగ్గంపేటలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

జగ్గంపేట: మండలంలోని గుర్రంపాలెంలో గత 20 ఏళ్లుగా పేదలు సాగు చేసుకుంటున్న సీలింగ్ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు రాకుండా కొంత మంది నేతలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ సమస్యపై ఇప్పటికే జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించామన్నారు. దీనిపై జేసీ స్పందించి సాగుదారులకే పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, డివిజన్ కార్యదర్శి డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు ముష్టి పురుషోత్తం, ఉపాధ్యాయుల రమేష్, దేవస్థానం వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ, వనదుర్గ ఆలయ అర్చకులు యడవిల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 50 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవారికి లక్ష కుంకుమార్చన

ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి అర్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రుత్విక్కులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు.

సంక్షిప్తంగా...

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



తునిలో హాస్టల్ విద్యార్థినులకు పరుపులు, దిండ్లు అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

తుని: రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని ప్రముఖ వైద్యులు డాక్టర్ శశికళ అన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో 72 మంది బాలికలకు శుక్రవారం రోటరీ సంస్థ సమకూర్చిన పరుపులు, దిండ్లు, ఇన్వెర్టర్‌ను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శశికళ మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు రోటరీ సంస్థ సౌకర్యాలు కల్పించడం సంతోషించదగ్గ విషయమన్నారు. బాలికల ఆరోగ్య పరిరక్షణకు 15 రోజులకు ఒకసారి హాస్టల్‌కు వచ్చి ఉచితంగా వైద్య సేవలు అందిస్తామన్నారు. విద్యార్థినులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం హాస్టల్‌కు గ్రైండర్, మిక్సీలను అందజేశారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బారాయులు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేఎస్ఎల్ఎస్ వర్మ, కార్యదర్శి కిషోర్‌రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోటనందూరు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే..మండల కేంద్రం కోటనందూరులో ఓ గొడౌన్‌లో నిల్వ చేసిన 3,550 కేజీల రేషన్ బియ్యాన్ని పెనుముచ్చు నరేష్ బొలెరో వ్యాన్‌లో కోళ్ల ఫారాలకు తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న విజిలెన్స్, రెవెన్యూ అధికారులు కేఏ మల్లవరం సెంటర్లో కాపు కాసి అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న వాహనాన్ని, డ్రైవర్ పెనుముచ్చు నరేష్‌ను అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రేఖవానిపాలెం గొడౌన్‌కు తరలించారు. డ్రైవర్ నరేష్‌ను పోలీసులు అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ సీఐ ఎస్.రమేష్ హెచ్చరించారు. విజిలెన్స్ తహసీల్దార్ కె.విజయ్‌కుమార్, సీఎస్ డీటీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు

ప్రత్తిపాడు: పదహారో నంబర్ జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలైనట్టు స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న పార్శిల్ లారీ మధ్యాహ్నం సమయానికి స్థానిక సంతోషిమాత ఆలయం వద్దకు వచ్చే సరికి మరమ్మత్తులకు గురైంది. దీంతో లారీని రోడ్డు పక్కన నిలుపుదల చేశారు. అదే మార్గంలో విశాఖ నుంచి విజయవాడకు గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న లారీ ఆగిఉన్న పార్శిల్ లారీని ఢీకొంది. ఈ సంఘటనలో ఎన్‌టీఆర్ జిల్లా నందిగామాకు చెందిన గ్యాస్ సిలిండర్ల లారీ డ్రైవర్ బేరోతు రమేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన రమేష్‌ను స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బియ్యం వ్యాపారిపై దౌర్జన్యం

- ముగ్గురు విలేకర్లపై కేసు

జగ్గంపేట: బియ్యం వ్యాపారిని డబ్బుల కోసం బెదిరించి, దౌర్జన్యం చేసిన ముగ్గురు విలేకర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సూర్య అప్పారావు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం .. కిర్లంపూడి మండలం గోనాడ గ్రామానికి చెందిన తోట శ్రీను బొలేరో వాహనంలో ఉప్పుడు బియ్యం , నూకలు వేసుకుని రామవరం నుంచి వస్తున్నాడు. అతడిని జగ్గంపేట వద్ద జాతీయ రహదారిపై జగ్గంపేటకు చెందిన వైఎస్ఎస్ మీడియా విలేకరి సాలిపల్లి శివాజీ, తీరభూమి విలేకరి ఆకుల సోమశేఖర్, పెద్దాపురానికి చెందిన కేబీఆర్ యూట్యూబ్ చానల్ విలేకరి బొమ్మిడి అవినాష్ అడ్డగించారు. వ్యాన్‌లో రేషన్ బియ్యం తరలిస్తున్నారంటూ తోట శ్రీనుపై ఎంత చెప్పినా వినకుండా దౌర్జన్యం చేయడంతో పాటు రూ.10 వేలు ఇవ్వాలంటూ ఒత్తిడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురు విలేకర్లపై కేసు నమోదు చేశారు.

నేటి నుంచి 30 వీఐపీ భవనం కూల్చివేత

అన్నవరం: రత్నగిరిపై 30 వీఐపీ భవనం కూలివేత పనులు శనివారం ఉదయం ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు. తొలుత ఈశాన్యంలో కొంత కూల్చివేసి ఆ తరువాత జేసీబీతో పడమర వైపు నుంచి కూల్చివేస్తారని అధికారులు తెలిపారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- శంఖవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రారంభం



శంఖవరంలో ఆరోగ్య సురక్ష కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

శంఖవరం: ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. శంఖవరంలో శుక్రవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తారన్నారు. సర్వే అనంతరం ప్రతి ఇంటికి ఒక టోకెన్ ఇస్తారని, ప్రతి సచివాలయం పరిధిలో ప్రభుత్వం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తుందన్నారు. ఈ శిబిరాల్లో ప్రజలకు అన్ని రకాల వ్యాధులకు వైద్యం అందిస్తారన్నారు. ఈ నెల 29 వరకూ ఈ సర్వే కొనసాగుతుందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రజలందరికీ ప్రభుత్వం మెరుగైన వైద్యం అందిస్తుందన్నారు. అనంతరం ఏలేశ్వరానికి చెందిన విజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పర్వత ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, జేసీఎస్ అధ్యక్షుడు బుర్ర లచ్చబాబు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్నివర్గాలకూ మేలు

శంఖవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరుగుతోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. శంఖవరంలో శుక్రవారం ప్రత్తిపాడు మండలం వాకపల్లిలో నూతనంగా వివాహమైన మహిళలకు కల్యాణమస్తు చెక్కులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు పెళ్లి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో ఇటువంటి పథకాలు ఉన్నప్పటికీ ఏ ఒక్కరికీ సహాయం అందించలేదన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వాకపల్లి సర్పంచ్ రొంగలి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు రేఖా శ్రీను, ముడదా రమణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రహిత సమాజమే లక్ష్యం

- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



ఏలేశ్వరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ఏలేశ్వరం: సారా, గంజాయి రహిత సమాజమే లక్ష్యమని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సారా, గంజాయిని అరికట్టేందుకే పరివర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై జి.సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల సైన్స్ కాంగ్రెస్‌పై ఉపాధ్యాయులకు అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీవైఈఓ సుభద్ర

అన్నవరం: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను విద్యార్థులకు వివరించి, వారిని శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పిఠాపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి దాట్ల సుభద్ర సూచించారు. స్థానిక సత్యదేవ సంస్కృతోన్నత పాఠశాలలో శుక్రవారం రాష్ట్ర శాస్త్రసాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌పై ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సృజనాత్మక అంశాలపై ప్రతి విద్యార్థి ప్రాజెక్టులు రూపొందించేలా సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రాజెక్టులు రూపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలల సైన్స్ కాంగ్రెస్ ముఖ్య లక్ష్యం, ఉద్దేశాలను వివరించారు. అనంతరం మట్టి గణపతిని పూజిద్దాం..పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా అకడమిక్ కో ఆర్డినేటర్ కె.వెంకటరావు, ఎంఈఓ ఎస్వీ రమణ, అన్నవరం హైస్కూల్ హెచ్ఎం అల్లాడ వెంకటేశ్వరరావు, ట్రైనీ పిల్లి గోవిందరాజులు, రిసోర్స్ పర్సన్స్ కేవీకే మహేశ్వరరావు, పి.కుమారస్వామి, బి.సత్యప్రసాద్, ఎం.ప్రసాద్, పి.వీరేష్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.



తుని మున్సిపల్ కార్యాలయంలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి



ఎ.కొత్తపల్లిలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అర్హులందరికీ పింఛన్లు

తుని: గత టీడీపీ ప్రభుత్వ హయంలో పింఛన్ల కోసం ప్రజలు జన్మభూమి కమిటీలు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం అర్హత ఉండి దరఖాస్తు చేసే చాలు మంజూరు చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ ప్రసాదరాజు అధ్యక్షతన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని 30 వార్డుల్లోని లబ్ధిదారులకు చైర్‌పర్సన్ సుధారాణి కొత్త పింఛన్లు అందజేశారు. పేదల కోసం ప్రభుత్వం అన్ని పథకాలను ఇంటికే అందిస్తోందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పండగలా కొత్తగా పింఛన్ల పంపిణీ

తొండంగి: మండలంలోని గ్రామాల్లో కొత్త పింఛన్ల పంపిణీ పండగలా సాగుతోంది. ఎ.కొత్తపల్లిలో లబ్ధిదారులకు శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, సర్పంచ్ బెక్కం వరలక్ష్మితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు నందెపు చిన్న, ఎలుగుబంటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గణపతి నవరాత్ర ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

తొండంగి: వినాయక చవితి ఉత్సవాలను గ్రామాల్లో నిర్వహించేందుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఎస్సై జి.వెంకటేశ్వరరావు అన్నారు. దానవాయిపేటలోని మత్స్యకార కమ్యూనిటీ హాలులో శుక్రవారం ఈఅంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉన్నతాధికారుల మార్గదర్శకాల ప్రకారం వినాయక చవితి ఉత్సవాల్లో ఎటువంటి ప్రమాదాలకు, అల్లర్లకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో ఉత్సవ కమిటీల సభ్యులు విగ్రహాల వద్ద రాత్రి, పగలు కాపలా ఉండాలన్నారు. ఊరేగింపు వాహనాలు, మైక్ వినియోగం, బాణా సంచా వినియోగం వంటి వాటిపై ముందస్తు సమాచారం ఇచ్చి అనుమతులు పొందాలన్నారు. ప్రమాదాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మడదా తిరుమల కుమారి, వైఎస్సార్ సీపీ యువ నాయకుడు మడదా హేమంత్, ఏఎస్సై రాయవరపు వి.రమణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కోటనందూరులో...

కోటనందూరు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండపాలు, విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గ్రామాల్లో విగ్రహాలు, మండపాలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో విధిగా ఉత్సవ కమిటీలు ఏర్పాటు కావాలన్నారు. వినాయక నిమజ్జనం జరిగే వరకూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉత్సవ కమిటీలపై ఉంటుందన్నారు. పోలీసులతో పాటు పంచాయతీ, స్థల యజమానుల అనుమతి తీసుకోవాలన్నారు. రాత్రి 10 గంటల తరువాత మైక్‌లు వాడకూడదని, డీజే సౌండ్లకు అనుమతి లేదని, మసీదులు, చర్చిలకు దూరంగా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పోలీసులకు సమాచారం ఇవ్వాలి

రౌతులపూడి: వినాయక చవితి వేడుకల్లో భాగంగా మండపాలు ఏర్పాటు చేసే ఆలయ కమిటీలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని రౌతులపూడి ఎస్సై అబ్దుల్‌నబీ సూచించారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

తునిలో...

తుని: గణపతి నవరాత్ర ఉత్సవాలు నిర్వహించే ఆలయ కమిటీలు విధిగా పోలీస్, మున్సిపల్, ట్రాన్స్‌కో అధికారుల అనుమతులు తీసుకోవాలని తుని పట్టణ సీఐ ఎం.గీతా రామకృష్ణ సూచించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ లతా కుమారి ఆదేశాల మేరకు గణపతి నవరాత్ర ఉత్సవాలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. గ్రామాలు, పట్టణాల్లో గణపతిని నెలకొల్పడం నుంచి నిమజ్జనం వరకూ ఉత్సవ కమిటీలే బాధ్యత తీసుకోవాలన్నారు. స్థలం ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులకు సంబంధించినదైనా అనుమతి తీసుకోవాలన్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం ట్రాన్స్‌కో అధికారుల అనుమతి పొందాలన్నారు. డీజే సౌండ్‌లకు అనుమతి లేదన్నారు. ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. అందరూ ఆనందంగా పండగ జరుపుకుని పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.